క్లుప్తంగా

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఆదోని టౌన్: క్షయవ్యాధి (టీబీ) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు షేకున్‌బాను, పృథ్వీరాజ్, సైనజ్‌బేగం అన్నారు. మంగళవారం ఆదోని పట్టణంలోని శంకర్‌నగర్, ఇందిరానగర్, హవన్నపేటలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో టీబీపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, దగ్గులో రక్తపుచారలు, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉన్నవారు ఉదయం గల్ల తీసి పరీక్షకై ఆసుపత్రికి రావాలన్నారు. టీబీ నమోదు అయిన వారికి ఆరు నెలకు సరిపడా మందులు ఉచితంగా ఇస్తూ, వారికి నెలకు రూ.1000 అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, వీరేష్, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పరామర్శ



హాజీ అల్లాబకాష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ముస్లిం తబ్లిక్ జమాత్ అమీర్ హాజీ అల్లాబకాష్ అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జామియా మసీద్ అధ్యక్షుడు ఖాశింబేగ్, హాజీ అబ్దుల్ వాహిద్, వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మెకానిక్ బాష తదితరులు పాల్గొన్నారు.

మాజీ వీఆర్వో మృతి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని చెట్నహళ్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో వీరన్నగౌడ్ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్ రెడ్డి మంగళవారం ఉదయం వీరన్నగౌడ్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు పాలక మండలి మాజీ సభ్యుడు వై. సీతారామిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమిరెడ్డి, మండల ఇన్‌చార్జీ సీబీ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ అంజనయ్య, మాజీ సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ సభ్యులు రామాంజనేయులు, నాయకులు ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



ఆలయ ఆవరణలో అన్నదానం చేపడుతున్న దృశ్యం

ఆదోని రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ మండిగిరి పరిధిలోని రాఘవేంద్ర కాలనీ చిన్మయ మిషన్‌లోని సంజీవరాయ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజలు, మహామంగళహారతి, పల్లకీసేవ తదితర పూజలు చేపట్టారు. కాంట్రాక్టర్, చిన్మయ మిషన్ అధ్యక్షులు హెగటి ప్రతాప్ సొంత నిధులతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అలసంద గుత్తి ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శివరామ్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, మండిగిరి మాజీ సర్పంచ్ శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



నందవరం : పవిత్ర పుణ్యక్షేతం దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో భక్తులు భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు గావించారు. మంగళవారం అమావాస్య కావడంతో భక్తులతో గురజాల శైవ క్షేత్రంతో పాటు నందవరంలోని బంగారమ్మవ్వ దేవాలయం, భీరప్ప స్వామి ఆలయం కిటకిటలాడియి. గురజాల గ్రామంలో పవిత్ర శైవక్షేత్రంలో తెల్లవారుజాము నుంచే భక్తులు నదీ స్నానాలు ఆచరించి రామలింగేశ్వర స్వామికి పురోహితులు హంపేష్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

- రోడ్లపై నిలుస్తున్న వర్షపు నీరు
- దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే ప్రమాదం
- శిథిల రోడ్లతో పట్టణ వాసుల అవస్థలు

చినుకు పడితే మడుగులే!



చెరువును తలపిస్తున్న పట్టణంలోని టోపయ్య గుడి ప్రాంతం



న్యూఎస్సీ కాలనీ వీధిలో వరినారు వేయొచ్చని చూపుతున్న కాలనీ వాసులు

ఎమ్మిగనూరుటౌన్: చిన్న పాటి వర్షం వస్తే చాలు పట్టణంలోని కొన్ని ప్రాంతాలు మురుగు కుంటలు, నీటి మడుగుల్లా మారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఎప్పుడో వేసిన రోడ్లు కంకర తేలి ఏమాత్రం ఆదమరిస్తే కిందపడి కాలో చేయ్యో విరగొట్టుకునే దుస్థితి నెలకొందని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగుచేయాలని కోరుతున్నారు.

రహదారి బురదమయం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శివారు ప్రాంతాల్లోని రహదారులు పూర్తిగా బురదమయం అయ్యాయి. పట్టణంలోని న్యూఎస్సీ కాలనీలో ఓ వీధిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంత వాసులు పడుతున్న అవస్థలు వర్ణణాతీతంగా మారాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇటీవల సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులతో కలిసి ఆ వీధి వాసులు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వరి నారు వేసి నిరసన వ్యక్తం చేశారు. కాలనీకి డ్రైనేజీతో పాటు సీసీ రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు. వర్షపు నీటికి తోడు మురుగు నీరు కలుస్తుండటంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

శిథిలమై కంకరతేలిన రోడ్డు

పట్టణంలోని గాంధీ నగర్‌లో దేవి అపార్ట్ మెంట్ వద్ద ఉన్న రోడ్డు 25 సంవత్సరాల క్రితం నిర్మించడంతో శిథిలమై కంకర తేలి నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి నెలకొందని ఆప్రాంత వాసులు పేర్కొంటున్నారు. పట్టణంలోని మునెప్ప నగర్, ఎస్ఎంటీ కాలనీ, మైనారిటీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు లేక ఆయా ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చెరువును తలపిస్తున్న టోపయ్య గుడి ప్రాంతం

వర్షాలతో పట్టణంలోని తేరు బజారు ప్రాంతంలోని టోపయ్య గుడి వద్ద వర్షపు నీటితో చెరువును తలపిస్తోంది. గుడి ప్రాంతంలో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించిన అధికారులు పద్మశాలి కళ్యాణ మండపం వద్ద గ్యాప్ పెట్టడంతో ఆ ప్రాంతమంతా వర్షపు నీరు నిలిచిపోయిందని సీపీఎం నాయకుడు గోవిందు, ఆ ప్రాంత నాయకులు రమేష్, గౌస్, షఫీ చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు డ్రైన్ నిర్మాణం చేపట్టక సీసీ రోడ్డు నిర్మించడంతో వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందని ఇప్పటికైనా అధికారులు వర్షపు నీరు నిలువ వుండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షపు నీటిలోనే నడవాలి



చిన్నపాటి వర్షం వస్తే చాలు న్యూ ఎస్సీ కాలనీలోని మా వీధి నీటి మడుగులా మారుతుంది. దివ్యాంగుడైన నేను, ముసలివారు ఆ నీటిలోనే నడిచి వెళ్లాలి. దీంతో పలువురు కిందపడి గాయాల పాలైన సందర్భాలున్నాయి. మున్సిపల్ అధికారులు మాలాంటి వారు ఇబ్బందులు పడకుండా సీసీ రోడ్డు నిర్మించాలని వేడుకొంటున్నా. – బాలస్వామి, న్యూఎస్సీ కాలనీ

రోడ్డు శిథిలమైంది



పట్టణంలోని గాంధీ నగర్ పక్కన ఉన్న దేవీ అపార్ట్ మెంట్ వద్ద 25 సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మించారు. వర్షాలకు రోడ్డు పూర్తి శిథిలమై కంకర తేలి నడిచేందుకు కూడా వీలు లేకుండా వుంది. వృద్ధులు, పిల్లలు పలు మార్లు కంకర తేలిన రోడ్డుపై కింద పడి గాయాలపాలైనారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఇప్పటికైనా రోడ్డును పునర్నిర్మించి మా కాలనీ వాసుల సమస్య పరిష్కరించాలి. – లక్ష్మణ్‌సాగర్, ఎమ్మిగనూరు

శిల్పాల ఊరేగింపు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న శిలా మండప నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శిలా మండప నిర్మాణానికి కావాల్సిన సామగ్రి, రాతి దూలాలు, స్తంభాలు మంగళవారం కర్ణాటక నుంచి లారీలో రావడంతో వైఎస్సార్ సర్కిల్ వద్ద పూజలు చేసి గ్రామ పుర వీధుల గుండా బ్యాండు మేళాలతో ఊరేగింపు నిర్వహించారు. సుమారు కోటి రూపాయలు భక్తుల విరాళాలతో ఆలయం వద్ద శిలా మండప నిర్మాణం జరుగుతోంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యత

మంత్రాలయం రూరల్: కిశోర బాలికల సంరక్షణ, సాధికారత మనందరి బాధ్యత అని సీడీపీఓ కె.నరసమ్మ అన్నారు. మంగళవారం మంత్రాలయం మండల కేంద్రంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం–4లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం– వేసవి సెలవుల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కిశోర బాలికలు, మహిళలకు విద్యా నైపుణ్యాలు, సైబర్ నేరాలు, బాలికల సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆన్‌లైన్ భద్రత, మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ..బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలని, విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీరగోవిందమ్మ, పీహెచ్‌సీ జ్యోతి, మహిళ పోలీసు శాంతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి



నాగలదిన్నెలోని వరద కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

నందవరం : నాగలదిన్నె వరద(కొత్త) కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గ్రామంలోని కొత్త వరద కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతులను సబ్ కలెక్టర్ పరిశీలించారు. అయన మాట్లాడుతూ.. కాలనీలో చేనేత కార్మికుల కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షా కాలం ప్రారంభం కావడంతో చినుకు పడితే చిత్తడి చిత్తడిగా రోడ్లు ఉన్నాయని నడవడానికి ఇబ్బందులు పడుతున్నామని, తాగు నీటికి ఎద్దడి పరిష్కరించాలని కాలనీ వాసులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కాలనీలో రోడ్లు, తాగు నీటి వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూర్తి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో కక్ష సాధింపు ఆపండి

ఆదోని సెంట్రల్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ప్రమోషన్లలో కక్ష సాధింపు చర్యలు ఆపాలని రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.ఉజ్వల్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్.రామచంద్ర అన్నారు. మంగళవారం వారు స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యాశాఖలో పరిషత్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ స్కూల్ అసిస్టెంట్లకు అన్యాయం జరిగిందని, జీఓ నంబర్ 2 ప్రకారం రోల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా అన్యాయంగా హెచ్‌ఎంల పదోన్నతులు నిర్వహించాలని చూస్తున్నారన్నారు. 360 మంది స్కూల్ అసిస్టెంట్లను వెరిఫికేషన్ కోసం పిలిచిన విద్యాశాఖ ఎస్సీ, ఎస్టీల గురించి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ప్రమోషన్లను సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఫోరం రామాంజనేయులు మాదిగ, స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు నరేష్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తుగ్గలి: కడుపునొప్పి తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. ఉప్పర్లపల్లికి చెందిన పి. కృష్ణవేణి (47) రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. భర్త రామచంద్ర పలు ఆస్పత్రుల్లో చూపించినా ప్రయోజనం లేకపోయింది. సోమవారం కెమికల్ ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త గుత్తికి తరలించాడు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పత్తికొండ మండలం హోసూరుకు చెందిన కృష్ణవేణికి 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం లేదు. మృతురాలి సోదరుడు జయ రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంగళవారం విలేకరులకు తెలిపారు.

మదిరలో తాగునీటి ఎద్దడి



మినీ ట్యాంకు వద్ద నీటి కోసం వేచి వున్న ప్రజలు

కౌతాళం : గ్రామాల్లో తాగునీటి కోసం కష్టాలు తప్పడం లేదు. మండల పరిధిలోని మదిర గ్రామంలో తాగునీటి ఎద్దడితో నిత్యం ఘర్షణ వాతవరణం నెలకొంది. పొదలకుంటకు మజరా గ్రామం అయిన మదిర గ్రామంలో బోరు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామం మొత్తం మీద ఒక్కటే నీటి దిమ్మె (మినీ ట్యాంకు) ఉండడంతో గ్రామస్తులందరూ నీటి కోసం ఇక్కడికే రావాల్సిన పరిస్థితి. బిందెలతో వంతు కోసం వరుసలో నిల్చోవాల్సిన వస్తోంది. దీంతో ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఈ నీరు కూడా వాడుకోవడానికి మాత్రమే పనికి వస్తాయి. తాగునీరు కావాలంటే పొలాల్లోని బోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కరెంటు ఉంటేనే నీళ్లు వస్తాయి



కరెంటు ఉంటేనే నీళ్లు వస్తాయి. అది కూడా నీరు వాడుకోవడానికి మాత్రమే వస్తాయి. తాగునీటి కోసం పొలాల్లో ఉన్న బోరుకు వెళ్లాలి. లేదంటే కాత్రికి గ్రామ రస్తాలో ఉన్న బోరుకు వెళ్లి నీరు తీసుకుని రావాల్సి పరిస్థితి ఉంది. మా గ్రామ నీటి కష్టాలు ఎవరు వచ్చి తీర్చుతారో తెలియడం లేదు. – చాముండి

ఎవరూ పట్టించుకోవడం లేదు



గ్రామంలో నీళ్ల సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. వాడుకోవడానికి ఒక చోట నీరు పట్టుకోవాలి.. తాగడానికి దూరప్రాంతాలకు వెళ్లి నీళ్లు తీసుకొని రావాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు కానీ, నాయకులు కానీ నీటి సమస్యలను పట్టించుకోవడం లేదు. – అన్నపూర్ణ

ట్రాన్స్‌కో అధికారుల సూచనలు పాటించండి

కౌతాళం: విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్ కో అధికారుల సూచనలు పాటించాలని మండల ట్రాన్స్‌కో ఏఈ నర్సన్న కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షా కాలం జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ పోల్స్‌ను తాకరాదన్నారు. తడి చేతులతో, తడి వస్తువులతో విద్యుత్ పరికరాలను తాకరాదని, విద్యుత్ పరికరాలను సొంతంగా రిపేరు చేసుకునే ప్రయత్నం చేయరాదన్నారు. డ్యామేజ్ వైర్లు ముట్టరాదని, పరికరాలకు పిల్లలను దూరంగా ఉంచాలని, వర్షం వచ్చేటప్పుడు విద్యుత్ లైన్ల కింద, పోల్స్ దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర నిలబడరాదని చెప్పారు. వైర్లను తాకడం కానీ తొక్కటం గానీ చేయరాదని, వర్షాలు పడేటప్పుడు అవసరం అయితే తప్ప బయటకు రాకూడదని సూచించారు.

ట్రాఫిక్ జాం



కోసిగి రైల్వే గేటు సమీపంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

కోసిగి: మండలకేంద్ర కేంద్రం కోసిగిలో వాహనాల రద్దీ పెరిగి తీవ్ర ట్రాఫిక్ జాం అయ్యింది. మంగళవారం అమావాస్య పర్వదినం కావడంతో కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ప్రధానంగా కోసిగిలో రైల్వే గేటు పడటంతో వాహనాలు గేటుకు ఇరువైపులా భారీగా నిలిచి పోయాయి. గేటు తెరిచిన వెంటనే ట్రాఫిక్ క్లీయరెన్స్ చేసే నాథుడే లేక వాహనాలు గంట మేర ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే జుమ్మలదిన్నె గ్రామంలో ఇళ్ల మధ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగుతున్నాయి. ఆ ప్రాంతంలో సింగిల్ రోడ్డు ఉండడంతో వాహనాలు ట్రాఫిక్ ఏర్పడింది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

నెహ్రూకు నివాళి

కోసిగి: దివంగత ప్రధాన మంత్రి పండింట్ జవహర్ లాల్ నెహ్రూ 61 వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలోని దొరల జిన్ను ఆవరణలో నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మురళీ కృష్ణంరాజు దొర, శ్రీనివాస రాజు దొర, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిలానీ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శ్యామ్ దొర, తిరుమల, రాజా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లే డ్రైనేజీలు



ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కౌతాళం : అధికారుల పర్యవేక్షణ లోపం గ్రామాలకు శాపంగా మారింది. మురుగు కాలువలు పూడిపోవడంతో రోడ్లు డ్రైనేజీలను తలపిస్తున్నాయి. మండల పరిధిలోని హాల్వి గ్రామంలో ఏ వీధి చూసినా మురుగునీరే దర్శనమిస్తోంది. గ్రామంలోని ప్రధాన వీధుల్లో రోడ్లపైనే మురుగు నీటితో పాటు కుళాయి పైపులైన్ లీకేజీ నీరు పారుతోంది. మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్తచెదారం పేరుకుపోయి రాత్రి సమయాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాలలో పారిశుద్ధ్యపు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఈరన్నస్వామికి అమావాస్య పూజలు



ఉరుకుందలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి వేలాది మంది భక్తులు తరలిరావడంతో సందడిగా నెలకొంది. మంగళవారం అమావాస్య ఉండడంతో తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకోవాడానికి తరలివచ్చారు. సోమవారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన పూజలు చేపట్టడంతో భక్తులు ఈ పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు.

బుడుములదొడ్డిలో..

ఉరుకుంద సమీపంలోని బుడుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తుల సందడిగా నెలకుంది. ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆంజినేయస్వామిని దర్శనానికి కూడా తరలివచ్చారు. అలాగే తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం అమావాస్య వేడుకలతో భక్తులు అధికంగా తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

దర్గాలో అమావాస్య వేడుకలు

మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో మంగళవారం అమావాస్య వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలకు వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. మంగళవారం అమావాస్య కావడంతో భక్తులు సోమవారం సాయంత్రం నుంచే తరలివచ్చారు. కొంతమంది భక్తులు పిండి వంటలు వండి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికంగా స్వామి దర్శనానికి తరలిరావడంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని కిటకిటలాడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

వర్షంతో ఉపశమనం

ఆదోని సెంట్రల్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతవరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం రాత్రి వరకు ఆదోని డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుశాయి. దీంతో వాతవరణం చల్లబడింది. నెలన్నర రోజులు పైగా ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయారు. ఉదయం నుంచే భానుడు ప్రతాపాన్ని చూపిస్తుండడంతో జనాలు బయటికి వెళ్లాలి అంటేనే ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం వాతవరణంలో మార్పులు చోటు చేసుకొని వర్షాలు కురువడంతో ఉపశమనం పొందుతున్నారు.

కౌతాళంలో అత్యధిక వర్షం

ఆదోని డివిజన్ పరిధిలో అత్యధిక వర్షం కౌతాళం మండలంలో 42.0 మిల్లీ మీటర్లు కురువగా, అత్యల్పంగా హోళగుంద మండలంలో 9.4 మిల్లీ మీటర్లు కురిసింది. డివిజన్ పరిధిలో సగటున 24.6 మిల్లీ మీటర్లు వర్షపాతం పడింది. పెద్దకడబూరు మండలంలో 38.4 మిల్లీ మీటర్లు, ఎమ్మిగనూరు మండలంలో 37.2 మిల్లీ మీటర్లు, ఆదోని మండలంలో 22.8 మిల్లీ మీటర్లు, కోసిగి మండలంలో 22.8 మిల్లీ మీటర్లు, గొనేగొండ్ల మండలంలో 17.2 మిల్లీ మీటర్లు, నందవరం మండలంలో 13.2 మిల్లీ మీటర్లు, మంత్రాలయం మండలంలో 13.0 మిల్లీ మీటర్లు వర్షం నమోదయ్యింది. రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతవరణ శాఖ హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తమై జాగ్రతగా ఉండాలన్నారు.

ఎండీయూ ఆపరేటర్‌లను కొనసాగించాలి

పత్తికొండ రూరల్: రేషన్ సరుకులను ఇంటింటికీ అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్‌లను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ కూడలి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు మొబైల్ వ్యాన్లతో ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. ఎండీయూ ఆపరేటర్‌లను తొలగించాలనుకునే ఆలోచన విరమించుకోవాలన్నారు. దీని వల్ల వేల సంఖ్యలో నిరుద్యోగులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు దస్తగిరి, ఎండీయూ ఆపరేటర్‌లు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



ఆదోనిలో యోగాసనాలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, అధికారులు

మంత్రాలయం రూరల్ : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహితి, ఎంపీడీఓ సూర్జహాన్, ఎంఈఓ మెయినుద్దీన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాస్టర్ ఆఫ్ ట్రైనర్లతో అధికారులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..నేటి నుంచి మండలంలోని అన్ని గ్రామాలలో యోగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమతాయని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఓటీలు రవీంద్ర, నరసింహులు, సూరజ్, బసవరాజు, నరసింహారాజు, శ్రీనివాసులు, కల్యాణి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుప, మాస్టర్లు పాల్గొని యోగా చేశారు.

గోనెగండ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఎంపీడీఓ మణి మంజరి ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా మాస్టర్ ట్రైనర్ కళ్యాణి, రాజశేఖర్, నాగముణి, రేణుక పర్యవేక్షణలో యోగా చేశారు. ఈఓఆర్డీ అనంతసేన, ఏపీఎం హేమలత, ఎంఈఓ నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ, పోటీల కార్యక్రమంపై మాస్టర్ ట్రైనర్స్‌తో ఎంపీడీఓ పుల్లయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రఘునాథ్, ఏఓ కృష్ణమూర్తి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

ఎమ్మిగనూరుటౌన్: జూన్ 21వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో యోగాంధ్ర శిక్షణ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, పట్టణ సీఐ శ్రీనివాసులు, నోడల్ అధికారి స్వర్ణలత, ఎంఈఓ మధుసుదన్‌రాజు పాల్గొన్నారు.

కౌతాళం: యోగాతోనే ఆరోగ్యం బాగుంటుందని తహసీల్దారు రజినికాంత్‌రెడ్డి, ఎంపీడీఓ విజయశేఖర్‌లు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులతో కలిసి చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ శోభరాణి, ఈఓపీఆర్‌డీ ప్రకాశం పాల్గొన్నారు.